## క్లుప్తంగా

### జాబ్‌కార్డు ఇప్పించండి

**జియ్యమ్మవలస:** ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, జాబ్‌కార్డు ఇప్పించాలని మండలానికి చెందిన కొంతమంది స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.రమేష్‌ను సోమవారం కలిసి కోరారు. అర్హులందరికీ జాబ్‌కార్డు ఇస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### 1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**సీతంపేట:** మండలంలోని మల్లమ్మకొండ ప్రాంతంలో సారా తయారీకి సిద్ధంచేసిన సుమారు 1800 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. మల్లమ్మకొండ పరిసరాల్లో సోమవారం తనిఖీలు చేపట్టగా 30 డ్రమ్ములతో బెల్లం ఊట పట్టుబడగా.. పారబోసినట్లు చెప్పారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

### అప్రమత్తత తప్పనిసరి..

**పాలకొండ రూరల్:** పండగలకు ఇతర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు వచ్చిన వారు తిరుగు ముఖం పడుతున్న నేపథ్యంలో ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై నారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గస్తీ నిర్వహించారు. జేబుదొంగలు సంచరిస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులకు సూచించారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

### 108లో ప్రసవం



108లో ప్రసవించిన మహిళ

**సీతంపేట:** మండలంలోని జలుబుగూడ గ్రామానికి చెందిన సవర సుగుణ సోమవారం 108లో ప్రసవించింది. పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. ఈఎంటీ రాములు, పైలెట్ శంకరరావు గ్రామానికి చేరుకుని ఆమెను అంబులెన్స్‌లో తీసుకువస్తుండగా.. మార్గమధ్యలో నొప్పులు ఎక్కువకావడంతో సిబ్బంది ప్రసవం జరిపించగా.. పండంటి మగబిడ్డ జన్మించాడు. అనంతరం తల్లీబిడ్డలను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### పోలీసుల అదుపులో బ్యాటరీ దొంగలు

**భామిని:** మండలంలోని బత్తిలిలో గల బీఎస్ఎన్ఎల్, బాలేరు వద్దగల ఎయిర్‌టెల్ టవర్లకు సంబంధించిన బ్యాటరీలు ఇటీవల చోరీకి గురయ్యాయి. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సతివాడ కూడలి సోమవారం తనిఖీలు నిర్వహిస్తూ బ్యాటరీ దొంగలను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1.63 లక్షల విలువగల 58 బ్యాటరీలను, వాటిని తరలిస్తున్న ఆటోను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై డి. అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా హిరమండలం పరిధి శుభలై గ్రామానికి చెందిన ఆరుగురు నిందితులు ఈ చోరీలకు పాల్పడ్డారన్నారు. వీరు గతంలో కూడా ఇదే తరహాలో గరుగుబిల్లి, వీరఘట్టం, తదితర ప్రాంతాల్లో బ్యాటరీలు దొంగిలించారన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు.

### మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి

**వీరఘట్టం:** మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కనుగుల లలితకుమారి సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఏఫ్, వీఓఏలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో వాయిదాల పద్ధతిలో కట్టించేలా వారికి తరచూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎంలు చిన్నతల్లి, కెల్ల రాము, తదితరులు పాల్గొన్నారు.

### పండ్లతోటల పెంపకంపై రైతుల ఆసక్తి



మండలంలోని పెద్దూరు, గొట్టివలస, గరుగుబిల్లి గ్రామాల్లోని రైతులంతా పండ్లతోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఉల్లిభద్ర మీదుగా గరుగుబిల్లి వరకు ఉన్న జంఝావతి కాలువ ద్వారా సాగునీరు అంతగా సరఫరా కావడం లేదు. దీంతో వరి సాగు చేయడం లేదు. ప్రత్యామ్నాయంగా జీడి, మామిడి పండ్లతోటలతో పాటు పత్తి, నీలగిరి పంటలను పండిస్తున్నారు. ఈ పంటలకు ఏటా పెట్టుబడులు పెట్టనవసరం లేదని, సాగునీరు కూడా అంతగా అందించనవసరం లేదని రైతులు చెబుతున్నారు. గరుగుబిల్లి

### పరామర్శ..



వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని రాష్ట్ర తూర్పు కాపు సంఘ వర్కింగ్ ప్రసిడెంట్ మక్కా సాయిబాబానాయుడు సోమవారం పరామర్శించారు. రాజశేఖరం కుమారుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే శాంతిలను కలసి సంతాపం తెలియజేశారు. రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. – పాలకొండ

### పశు వైద్యశిబిరం ప్రారంభం..



సీతంపేట మండలంలోని మానాపురంలో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాన్ని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ నెల 31వరకు జరగనున్న శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఎ.డి శ్రీనివాసరావు, పశువైద్యాధికారి ఆర్. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

# సర్కారు వారి కోత..

- ఆరోగ్యశ్రీ పథకంలో పలు వైద్యసేవలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- శస్త్రచికిత్స చేసుకున్న వారికి అందని 'ఆసరా'
- వైఎస్సార్‌సీపీ హయాంలో రోజుకు రూ. 225 చొప్పున సాయం
- నేడు ఆ సాయానికి తెర దించేశారు



చికిత్స పొందుతున్న ఆరోగ్యశ్రీ రోగులు (ఫైల్)

**పాలకొండ రూరల్:** పేదల ఆరోగ్య సంరక్షణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంకితభావంతో కృషి చేసింది. ఎటువంటి ఆరోగ్య సమస్య తలెత్తినా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తోడ్పాటు అందించింది. దాదాపు 1,625 రకాల రోగాలకు ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా వైద్యసేవలందించేవారు. ఈక్రమంలో రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరించేది. అర్హత గల ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించింది. శస్త్రచికిత్సలు చేసుకున్న రోగులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా రోజుకు రూ. 225 చొప్పున..నెలకు గరిష్ఠంగా రూ. 5 వేలు చొప్పున అందించేవారు. దీంతో ఈ పథకం రోగులకు ఎంతో ఆసరాగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఇష్టానుసార నిర్ణయాల వల్ల రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**పథకానికి తూట్లు..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లో అనేక సంస్కరణల పేరిట గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు నిలువునా తూట్లు పొడుస్తోంది. ఈ క్రమంలో రోగులకు ఎంతో ఉపయోగపడే ఆరోగ్యశ్రీ ఆసరాని కొద్ది నెలల నుంచి పూర్తిస్థాయిలో నిలిపివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీవన్మరణ సమస్యతో ఇబ్బందులు పడే కిడ్నీ, డయాలసిస్ రోగులకు సైతం 108 సేవలు రద్దు చేసింది.

**15 మండలాల పరిధిలో..**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ, సీతంపేటలో ఏరియా ఆస్పత్రులుండగా.. చినమేరంగి, కురుపాం, భద్రగిరిలో సీహెచ్‌సీలున్నారు. వీటితో పాటు మరో ఆరు ప్రైవేట్ ఆస్పత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. నెలకు సగటున 500 శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గడిచిన ఏడాదిలో చివరి నెలలో 4,086 ఆపరేషన్లు చేయగా.. వారికి ఆర్థిక సాయం అందలేదు. ఇదిలా ఉంటే ఆరోగ్యశ్రీని బీమా పరిధిలోకి తీసుకువచ్చే యోచనలో ప్రభుత్వం ఉందని సమాచారం. దీంతో ట్రస్ట్‌లో పనిచేస్తున్న మూడు వేల పైచిలుకు ఆరోగ్య మిత్రలు, డీఎంలు, బృంద సభ్యుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారనుంది.



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కేంద్రం

**పథకాన్ని నీరుగార్చడం అన్యాయం..**



ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చడం అన్యాయం. ప్రభుత్వ నిర్ణయంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాత బకాయిలు చెల్లించింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసింది. ఆరోగ్యశ్రీలో అదనపు సేవలు చేర్చడంతో పాటు సేవల పరిధిని రూ. 5 లక్షల నుంచి 25 లక్షల రూపాయల వరకు పెంచింది. కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది.

– విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

**నాలుగు నెలలుగా..**

జూన్ నెలలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అక్టోబర్ నెల నుంచి నేటి వరకు ఆరోగ్య ఆసరాకు సంబంధించిన నిధులు విడుదల చేయలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన సాయాన్ని ఎందుకు నిలిపివేశారని పలువురు రోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుతున్నారు.

### పాత స్థలంలోనే నిర్మాణాలు..

**పాలకొండ రూరల్:** జలవనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని పాత స్థానంలోనే నిర్మించాలని ఏపీ రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అప్పలనాయుడు నేతృత్వంలో సభ్యులు మండలంలోని వెలగాడలో చేపడుతున్న నూతన భవనం పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. పట్టణంలో ఉన్న ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతనంగా కోటి రూపాయలతో నిర్మిస్తున్న భవనానికి రహదారి విస్తరణ సమస్య ఉంటుందన్నారు. విజయనగరం నుంచి హడ్డుబంగి వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చేపడితే భవనంలో చాలా భాగం కోల్పోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ క్రమంలో పాత భవనం ఉన్న చోటే కొత్త భవనం నిర్మిస్తే అధికారులకు కూడా రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ పునరాలోచించాలని కోరారు. సందర్శనలో సంఘ నాయకులు, నీటి సంఘం డైరెక్టర్లు పి.వైకుంఠరావు, డి.చిన్నంనాయుడు, యు.రాము, డి.చిన్నారావు తదిరులున్నారు.



జలవనరుల శాఖ నూతన భవన నిర్మాణాలు పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘ నాయకులు

### అభివృద్ధి పనులపై దృష్టి..

- ఎంపీపీ దమలపాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు

**వీరఘట్టం:** గ్రామాల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి పంపిణీ, పారిశుధ్య పరిరక్షణ పనులు పక్కాగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, మండల ఇంజినీరింగ్ అధికారి డి.కళ్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, తదితరులు ఉన్నారు.

### అట్రాసిటీ కేసుపై విచారణ

**వీరఘట్టం:** మండలంలోని విక్రమపురం గ్రామానికి చెందిన రాజేష్ కన్నాను కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై ఈనెల 16న గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. ఈ మేరకు పాలకొండ డీఎస్పీ ఎం. రాంబాబు సోమవారం గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. మోదైనవారితో,గ్రామ పెద్దలతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు.

# అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

**జియ్యమ్మవలస:** మండలంలోని కన్నపుదొరవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ..తొలుత అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, దాని ప్రయోజనాలను వివరించారు. మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర, ఆకుముడత, కాండం తొలుచు, కాయతొలుచు, వేప పురుగుల నివారణకు అగ్నిఅస్త్రం పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. మొక్క నాటిన 15 రోజులకు ట్యాంకు నీటిలో లీటరు అగ్నిఅస్త్రం కలిపి పంటపై పిచికారీ చేయాలని, 25 రోజులకు అరలీటరు, 45 రోజులకు లీటరు అగ్నిఅస్త్రం పిచికారీ చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తూ వ్యవసాయం చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.



అగ్నిఅస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

# దరఖాస్తుల ఆహ్వానం

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** ఐసీడీఎస్ కురుపాం ప్రాజెక్టు పరిధిలో ఆరు అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పీవో కె.విజయగౌరి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. కురుపాం మండలంలోని తిత్తిరి పంచాయతీ పరిధిలోని ఇప్పమానుగూడ, చింతమానుగూడ, తిత్తిపాయిగూడ గ్రామాలతో పాటు ఏగులవాడ పంచాయతీ పరిధిలోని పెదవనజ/ఇప్పలగుడ్డి, వబ్బంగి పంచాయతీలో ఉన్న సీరంగూడ, తియ్యాలిగూడ గ్రామాల్లో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టులకు స్థానికంగా నివశించిన ఎస్టీ మహిళలు మాత్రమే అర్హులన్నారు. పదో తరగతి పాసై, 1 జూలై 2024 నాటికి 21 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు అభ్యర్థులకు ఉండాలన్నారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి నేరుగా వచ్చి గానీ పోస్టల్ ద్వారా దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు గెజిటెడ్ అధికారి సంతకం చేసిన విద్యార్హత, కులం, నివాసం జిరాక్స్ కాపీలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూ తేదీ వివరాలు తర్వాత తెలియజేస్తామన్నారు.

**సీతంపేట:** మండలంలోని దిగువ బుడగరాయి, రేగులగూడ గ్రామాలకు నూతనంగా మంజూరైన రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ రంగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

**27లోగా అందజేయాలి..**

**భామిని:** మండలంలోని మాసగూడలో నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ కేంద్రంలో గల సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శాంతిభవానీ తెలిపారు. ఈ పోస్టు ఎస్టీకి రిజర్వ్ చేశామని, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27లోగా దరఖాస్తులు అందజేయాలని కోరారు.

# ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయం

**గుమ్మలక్ష్మీపురం:**

స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి, ప్రకృతి వ్యవసాయోత్పత్తులను సోమవారం విక్రయించారు. ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, సామలు, కొర్రలు, ఊదలు తదితర పంటలు శరీరానికి చాలా ఆరోగ్యం కావడంతో వాటిని కొనుగోలు చేసేందుకు ఎంపీడీవో, వెలుగు, ఉపాధి హామీ పథకం కార్యాలయాల సిబ్బంది పోటీపడ్డారు. కార్యక్రమంలో కిమిడి భూషణ్, జి.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఆకుకూరలు విక్రయిస్తున్న సిబ్బంది

# జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దే మద్దతు ధర

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర లభించాలంటే జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దే వాటిని విక్రయించాలని గుమ్మలక్ష్మీపురం జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తెలిపారు. జీసీసీ డీఎం, బీఎంల ఆదేశాల మేరకు కురుపాం మండలంలోని నీలకంఠాపురంలో సోమవారం జరిగిన వారపుసంత వద్ద అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు, సేకరణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జీసీసీ కొనుగోలు కేంద్రాలతో పాటు డీఆర్ డిపోల వద్ద కూడా అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతుందన్నారు. గతేడాది కిలో చింతపండు ధర రూ.32.40 ఉండగా, ఈ ఏడాది రూ.34కు పెంచడం జరిగిందన్నారు. కిలో రూ.18 ఉన్న కరక్కాయలను రూ.20కు పెంచడం జరిగిందన్నారు.



అవగాహన కల్పిస్తున్న జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ సాంబశివరావు

# ఎంపీహెచ్‌ఏలకు న్యాయం చేయండి

**గుమ్మలక్ష్మీపురం:** ఎంపీహెచ్ఏ(మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్)లకు న్యాయం చేయాలని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీహెచ్ఏ నోటిఫికేషన్–2002 వివాదంలో జీవో నంబరు 1207 ద్వారా ఒప్పంద ప్రాతిపదికన చేరిన ఎంపీహెచ్‌ఏలను విధుల నుంచి తప్పించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశించడంతో వారంతా రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 22 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని తొలగించాలని చర్యలకు ఉపక్రమిస్తుండడం అన్యాయమన్నారు. కేంద్రం జోక్యంతో వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.



చిన్నారావు

# పాడి రంగాన్ని అభివృద్ధి చేద్దాం..

- పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రభా మాణిక్యరావు



దూడలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశుసంవర్ధకశాఖ ఎ.డి మాణిక్యరావు

**పాలకొండ రూరల్:** ఉన్న వనరులను అందిపుచ్చుకుంటూ పాడిరంగాన్ని క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేద్దామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ప్రభా మాణిక్యరావు అన్నారు. పశు ఆరోగ్య శిబిరాల్లో భాగంగా సోమవారం మండలంలోని రాజుపేట, కొండాపురం గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ క్రమంలో 40 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు. అలాగే 54 దూడలకు నట్టల నివారణ మందులు వేయడంతో పాటు మరో 120 పశువులకు ఇతర చికిత్సలు అందజేసినట్లు పశు వైద్యాధికారి బి. సిద్ధార్థ తెలిపారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**

**వీరఘట్టం:** గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి చైతన్యశంకర్ సూచించారు. మండలంలోని కంబర గ్రామంలో ప్రారంభించిన పశు వైద్య శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం:** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని లక్కగూడ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు.



వీరఘట్టం: దూడకు మందు వేస్తున్న పశువైద్యాధికారి చైతన్యశంకర్

**గరుగుబిల్లి:** మండలంలోని మరుపెంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ రామారావు ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ వరకు జరిగే ఈ శిబిరాల్లో పశువులకు వైద్య తనిఖీలు నిర్వహించడంతో పాటు వ్యాధుల బారినపడకుండా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. పాడిరైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యు.నిర్మల, పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

**కొమరాడ:** మండలంలోని మాదలింగి గ్రామంలోని ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ శెట్టి శ్యామల ప్రారంభించారు. పాడి రైతులంతా పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సత్యనారాయణ, సర్పంచ్ తుమరాడ కళావతి తదితరులు పాల్గొన్నారు.

**అవగాహన పెంచుకోవాలి**

**భామిని:** పశువుల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తోట సింహాచలం అన్నారు. మండలంలోని కాట్రగడలో పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంతోష్‌కుమార్, సిబ్బంది పశువులను పరీక్షించి మందులు అందజేశారు.



గుమ్మలక్ష్మీపురం: లక్కగూడలో పాడిరైతులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



భామిని: కాట్రడగలో పశు వైద్యశిబిరం



కొమరాడ: మాదలింగిలో జరిగిన కార్యక్రమంలో పశువైద్య సేవలను ఆరంభిస్తున్న ఎంపీపీ శ్యామల



గరుగుబిల్లి: మరుపెంటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రామారావు

### అండగా ఉంటాం..

**పాలకొండ:** నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఆర్.రమణమూర్తి (56) సోమవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న నగర చైర్మన్ పల్లా ప్రతాపరావు, కమిషనర్ ఎస్.సర్వేశ్వరావుతో పాటు సహచర సిబ్బంది మృతుని ఇంటికి చేరుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భార్యా పిల్లలకు ధైర్యం చెప్పి ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మృతుడి భార్య రూ. 15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.